వారినుంచి తీసుకున్న గడ్డిలో సగం మేసినా సగంమేయకుండా వుంచిన గడ్డి బళ్ళల్లో సర్ది ఎక్కికూర్చున్నాం.

ఇక కంటి అయ్యన్న చెరువు వచ్చిందయ్యా! అదో పరువు పరుగెత్తిస్తూ ఎడ్లు బళ్ళను వద్దన్న వేగంగా లాక్కు వెళ్ళాము. కంటిఅయ్యన్న చెర్వు ఆవేళ ఏదో మైదానం అయియుంది. సవారిబళ్లు బాహాటంగా పరుగుమీద వెళ్ళేనున్నదనంలు ఏర్పడివుంది. రోడ్డుదారిని మారి ఆదారి పుచ్చుకున్నాం. ఒక్కలి ప్తలో వెళ్ళినట్టు వెళ్ళిపోయినాం, మా సవారిబళ్ళను గంటలు వాయించుకుంటూ మువ్వలచప్పుడు చేస్తూ శ్రీరంగపట్నం సాయంత్రం చుక్కలు పొడిచేసరికి—

అది వొకసరదా! అది వొక హుషారు!

.... .... .... .... ....

# మా సందు

"మా సందు" అని ఈ వ్యాసము ఎత్తుకోవడంలో, వెనకెప్పుడో 26-12-12 న రచించిన "కల" అనే నా ఖండకావ్యమునందలి ఒకానొక యుత్పలమాల జ్ఞాపకం వస్తోంది!—

"బందము చేతఁబట్టుకొని పాల్పితుకంగను వెళ్లి గొల్లనిన్
బొందుగ దూడలన్ గదలిపోవక యుండఁగఁ బట్టు పిల్లనిన్
దాందఅతోడ గోవులను దోలఁగ మేల్కొను పాలికాపు మా
సందునఁ బోవుటల్ కనుచు సంతసమెచ్చఁగఁ బల్కరించితిన్"

ఆ సందునే మా యూరిలో "కవుకొండలవారి సందు" అంటారు. "సందు" అని ఎప్పుడైతే అన్నామో, దాన్ని వొక దారిగాను, గమ్యస్థానం గలదిగాను, నిరూపించేశాం అన్నమాటే.

దారి బాహాటంగా రాజవీధిలోంచి లోపలకు దక్షిణంగా గజన్నర, రెండుగజాల వెడల్పున ఒక ఇరవై ముప్ఫై గజాల పొడుగున కనబడుతుంది : గమ్యస్థానం మాటే ఎప్పుడు చూచినా నాకు ఆలోచనీయంగా వుండిపోయేది. పేరునుబట్టి "కవుకొండలవారి యిళ్లు" అని అనుకున్నా "ఆ యిళ్ళు మాత్రమేనా?" అని ప్రశ్నగా వుండిపోయింది.

నేను ఆ సందులోనే పెద్దింటఁ బుట్టాను. ఆ పెద్దింటికి ఎదర ఓ మహత్తరమైన చతురాంగణము, అఖండ గౌతమిలా పరపైంది, వుంది. ఇప్పటికీ వుంది. ఈ పెద్దింటి కెదర మా పిన తాతగారి యిల్లు వుంది. ఆ యింటినిగురించి, ఆ యింటిలోని వారినిగురించి, తెలిసికొనేసరికి, బహుశా నాకు మూడేళ్ళయినా పట్టివుంటుంది. దాని దక్షిణంగా వున్న ఇంటిలోనివారిని తెలిసి కొనేసరికి అయిదారేళ్లైనా పట్టివుంటుంది నాలుగో యిల్లు బాగా మూలకువుండి, "మూలింటివారు" అనేపేరు ఇంటిలోనివారికి కూడా సార్థక నామధేయం గావించింది. ఆ యింటి నెఱుగ గలిగింది ఏ ఎనిమిదో ఏటో, తొమ్మిదో ఏటో కావచ్చు. ఈ నాలుగిళ్ళే ఆ సందులోని ఇళ్లు. మరి ఇళ్లులేవు. వాకిళ్ళూ లేవు. ఈ నాలుగిళ్ళూ కవుకొండలవారి యిళ్లేను. "ఈ సందు రాజవీధిలోనుంచి మా యిళ్ళకోసమేను. మఱి ఆవలకు దారిలేదు," అనే నమ్మకం గలిగిస్తూ దక్షిణంవైపు ఆ సందును మూసి వేసిందై, ఒక గోడవుండేది. ఆ గోడనుగురించి, ఆ గోడ ఆవలి వారినిగురించి, తెలిసికొనేసరికి బహుశా నేను పన్రెండు పదమూడేండ్ల వాడనై యుండాలి.

చిత్రం! గోడావలివారి యింటిపేరు "ఎల్లపు" వారు. ఎల్ల=సరిహద్దు. కవుకొండలవారి సందుకు దక్షిణపుటెల్లలో

వుండి ఆ సందును "బ్లైండ్ లేన్" గా గావించినవారు కావడం చేత ఆవలి దిశవారు "ఎల్లపువారు" అయినారేమో అనే ఆశ్చర్యము నాలో అప్పటప్పట రేకెత్తుతూవుంటుంది, ఇప్పటికీని. ఆ రోజుల్లో మటీని! ఎంచేతా అంటే మా సందు నిజంగా నాకు ఆ రోజుల్లో రెండోవెంపుకు దారిలేనటువంటిన్నీ, రెండోదెస తెలియరానటువంటిన్నీ, ఒక్క రాజవీథిలోనికే, ఉత్తరంవెంపుకు మాత్రమే మార్గమున్నటువంటిన్నీ చిత్రమైన సందుగా తోచేది.

"ఈ కుశలమైన సందు ఎప్పుడు సువిశాలమైంది? అసలు సువిశాలమైనది అయిందా ఏనాడైనా?" అనేదే ఈ వ్యాసము నందలి చర్చనీయాంశము.

నా దాయాదులందఱూ ఈ సందులోనివారే. మా తాత ముత్తాతలు అక్కడివారుగానే నిరూఢింపఁబడుతూ వచ్చారు. మా "బామ్మ" "కక్కబామ్మ" "అన్నయ్య బామ్మ" "వెంకం బామ్మ" ఇలాంటి వృద్ధ ప్రవృద్ధ స్త్రీలు, కాపరానికి వచ్చి, కడుపుపండి, నాలుగు కాయలుగాసి, కాలం మళ్లించు కున్నది ఆ సందులో నేట!—ఇప్పటికీ వుంది "కక్కబామ్మ" అనే ఆబిడ—తొంభై యేళ్లుండొచ్చు.—"కక్కబామ్మ" అంటే ఒకానొక కక్కయ్య, అనగా పినతాతగారి కొడుకు కక్కయ్య, ఆయన తల్లి అన్నమాట; ఇలాగ్గానే "అన్నయ్యగారు" ఏ ముత్తాత సహోదరుల వరసనో అయిన అన్నయ్య, వారి యింట్లోవుండే ముసిలి ఆబిడ "అన్నయ్యబామ్మ" మటీన్నీ "రాజప్ప! బాపప్ప!" ఇది ఒకవిధమైన ఆ సందులోని పరిభాష. మాబోటి కొత్తకొత్త చిఱుతలకు పెద్దవాళ్ళమీద మమకారం పుట్టించే కొత్తకొత్త పిలుపులూ వావులూను.

మా సందులోని నాలుగిళ్ళకూ అన్నీ సింహద్వారాలే! రాజవీధిలోనికి దారితీసే పెద్ద గుమ్మాలే! పెఱటి తోవలు లేనే లేవు, ఒక్క పెద్దింటికి తప్పిస్తే, పెద్దింటికి పడమటివైపు పెద్ద గుమ్మం, "దొడ్డి గుమ్మం" అనేది ఒకటి కద్దు. కాని అక్కడ హడావిడి, సందడి, మగవాళ్ళ రచ్చ అదీ సింహద్వారపువైపు కంటె హెచ్చు. ముప్పొద్దూ గాదెల్లో గింజలపోతో, గుంజల ముందుకు గడ్డిమోతో, జరుపుతూ, చెప్పరానివాళ్ళ దగ్గర్నుంచీ మసిలేదికూడా ఆవైపే. దీన్నిబట్టి ఆడవాళ్ళు వేఱే నడిచే మార్గంలేదు అని తెలుసుకోండి పాఠకులు! అందుకు చేతను, కోనేటినుంచి మంచినీళ్లు మడిగా తెచ్చుకునే తెన్ను తప్పిస్తే మఱో తెన్ను "కవుకొండలవారి కోడండ్రు" ఎఱుగరు అని వ్రాసినా అతిశయోక్తి కానేరదు. కోనేరెండిపోయి మఱోచోట నుంచి వేసంగిలో మంచినీళ్ళు తేవడం అంటూ వచ్చిందా, మా మగవాళ్ళం బళ్లుకట్టుకునో, ఈ రేళ్లు పన్నుకునో, గుండిగెల్తో తెచ్చి పోసికోవలసిందే.

అయితే కొన్నాళ్ళుగా తెలివితేటా హెచ్చి, ఇరుగు పొరుగు వారి స్నేహంబలిసి, ఊరివారితో కలిసి మెలగడంలో— పల్లెటూరి స్త్రీలోకం అంత గ్రుడ్డిగా శుద్ధ ఘోషామార్గంగా వుండ నేరదు—అని తెలుసుకొన్నాను. అధమపక్షం నడివీధిలోని చూపులు, మాటలు అందుకోవాలని, ఆలకించాలని, ఆబాల గోపాలం ప్రతియింటిలోని వారికీ వుంటుందనీ, అందుకు తగ్గ కంతలో, కలుగులో గావించుకోక మానరని, నాకు బోధపడింది. ఈ బోధపఱచుకోవడంలో ఊరిలోని రాజవీధికి "పారలెల్"గా, రైలుపట్టాలకు టెలిగ్రామ్ టెలిఫోన్ తీగెల్లా, లోగిళ్ళ

యేర్పాటుల్లోనే, కావలసిన ఇతర సౌకర్యాలు వుంటూవుంటాయని తేటపడింది. ఇళ్ళపేర్లు మఱి చెప్పినా పాఠకులకు విసుగు అయినా కొన్ని చెప్పక తప్పదు.

మాయింటికి పడమటెంపు "కటకం వారు" అనే కోమట్లు ఉన్నారు. వారింటికీ మాయింటికీ మధ్యకంత వొకటి కద్దు. అది మిక్కిలీ చిన్నది. చిన్నవాళ్ళంమాత్రమే దూరి వెళ్ళ డానికి వీలు. పెద్దవాళ్ళు కబుర్లు చెప్పుకొంటూ నిలబడి వుండ వలసిందే. మఱిన్ని కోమట్లకు సహజంగా బొట్లిలూ బొజ్జలూ వుంటాయి కాబట్టి అవలివాళ్లు ఈవలకు రాలేనంత చిన్నకంత ఏర్పాటు గావించి వుంటారు మావాళ్లు. మఱి ఇటు మా ఎదరింటి వారి యింటిలోనుంచి "వంగలవారింటి" లోనికి దారి ; వంగల వారింటిలోనుంచి "చాడావారి" వాకిట్లోకి—మళ్ళీ చాడావారి దొడ్డిగుమ్మం మా మూడింటివారికి పెరటి దిడ్డి. "వంగలవా" రంటే "చాడావా" రంటే వారందఱూ వైదీకులు.

ఈ దారులన్నీ ఏలాంటి దారులంటే, ఆలా నడిసీధిలో మోళీకట్టేవాడు డోలుమీద దెబ్బకొట్టాడన్నా, మేళ నాయకురాలు తాళం చిప్పలు టిక్కుటిక్కు మనిపించినా, ఊళ్లో స్త్రీలందరూ ఎక్కడెక్కడి వాళ్ళూ నడువీధిలోనికి వున్న గుమ్మాలాంట ఓరవాకిలిగా తొంగిచూడవలసిందే. వీళ్ళంతా ఎక్కణ్ణుంచి వచ్చారా, ఎందున్నారు ఆదాకా? అనేది లాతివాళ్ళ కెల్లకాలం పెద్ద వింత! సింహద్వారాలంట మగాళ్ళకెంత నిదానమో అంత నిదానమూను స్త్రీలకీ చిన్నచిన్న దిడ్డిగంతల గుండా!

అయినప్పటికీ సందు సందే!—గుడ్డిగా ఎల్లపారి గోడ వద్ద ఆగిపోయినట్టు ప్లానులో కనబడుపబడేది.

ఇలావుంటూవుండగా మొన్న మొన్న — మొన్ననే నిజంగా—మా అరుగుమీద నేను, మా యింటి కెదురుగావున్న అరుగుమీద మా పినతాతగారి మనమడు కూర్చునివుండగా ఒక హరిజనుడు సందు మొగకు వచ్చి "ఆలా పోనిస్తారా?" అని దక్షిణముఖం చూపించాడు.

"ఏం అటు దేవాలయం వుందా?" అన్నాను పరిహాసంగా. "చిత్తం" అంటూ వాడు, అతి పరిచయంగా, మేమింకా అరుగులమీద వుండగానే మమ్మల్ని దాటిపోయాడు.

"దేవాలయంలేదు దివ్యలోకంలేదు ఆవలి వీధికి" అన్నాడు మావాడు నాతో. "అవితే, మనసందుకూడా నేడు అందరికీ స్వచ్ఛంద రాజమార్గం అయింది అన్నమాటే" అని అన్నాను. "కాకపోవడమేం? చక్కని రాజమార్గమయింది" అన్నాడు ఆ సోదరుడు.

నూతనదృష్టిని తిరిగి సందర్శించాను మా సందును— సందుకు ఓవైపున అరటిచెట్లొదిగి, గెలలభారంచే వాఱిగి "కళ్యాణమే నిత్యకళ్యాణమే" అని పాడుతున్నాయి. మఱో వైపున ద్రాక్షలతలు గోడకెగ్రాకి చలువనీడ నిస్తున్నాయి. మఱొకచో రాధామనోహరపుష్పాలు! సందులోని చిన్న అరుగులమీద కూర్చున్నా, పెద్దరుగుమీద కూర్చున్నా, పెరళ్ళ ల్లోని ఏనాటి నూదిచెట్లయొక్క ఎత్తుసత్తువలూ, పోయిన ప్రాణా లను లేవదీసుకు వచ్చేవాటిలా కనబడ్డాయి! మార్గగామి హరిజనుడైనా, అగ్రజాతి వాడైనాసరే ఒకేరీతిని చల్లగా దక్షిణపు తెలిపినే పైరుగాలి వీస్తూ చెమ్మటాఱుస్తూ, ఆ వాడకు బ్రహ్మా నందం చేగూర్పక మానదు అని అనిపించింది.

....　　....　　....　　....　　....